క్లుప్తంగా

పండ్లతోటల సాగుతో రైతులకు మేలు



దంతాలపల్లి: పండ్లతోటలు సాగు చేయడం ద్వారా రైతులకు మేలు చేకూరుతుందని ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండలంలోని బొడ్లాడ గ్రామానికి చెందిన 17 మంది రైతులు 34 ఎకరాలలో తలపెట్టిన నిమ్మ చెట్ల సాగును మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులకు నిమ్మ మొక్కలను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేసే రైతులకు సబ్సిడీలను అందిస్తుందన్నారు. ప్రభుత్వ సహకారంతో రైతులు ముందుకు వచ్చి పండ్ల తోటలు సాగు చేయాలని గుర్తు చేశారు. ఎంపీఓ అప్సర్ పాషా, రైతులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో గల బోడగుట్టతండా, జమాండ్లపల్లి, చంద్యతండా, తట్టుపల్లి, తెల్ల బండతండా గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది మంగళవారం దాడులు నిర్వహించారు. 4ద్విచక్ర వాహనాలు, 18లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. జాటోత్ లక్ష్మణ్, భూక్య మల్సూర్, భూక్య నరేష్, భూక్య రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



కురవి: మన చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం సీరోలు మండలం కొత్తూరు(సీ) గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. జ్వరం వస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నిఖిల, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశ కార్యకర్తలు శైలజ, కలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష



గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట చేపట్టిన నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ దీక్షను ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత మాట్లాడారు. గార్ల సీహెచ్‌సీలో పూర్తిస్థాయి వైద్యులను నియమించాలని గత 2 రోజులుగా దీక్షలు చేస్తున్నా జిల్లా ఉన్నతాధికారులు స్పందించడం లేదన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ స్పందించి సీహెచ్‌సీలో రాత్రి సమయంలో వైద్యులను నియమించి, మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాసరావు, అలువాల సత్యవతి, నాగమణి, మౌనిక, రమ, నాగమణి, సుజాత, పద్మ పాల్గొన్నారు.

30క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం



పెద్దవంగర: అక్రమంగా నిల్వ ఉంచిన 30క్వింటాళ్ల నల్లబెల్లం, 3క్వింటాళ్ల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పెట్రోలింగ్ చేస్తుండగా మంగళవారం మండలంలోని లొట్లబండతండాకు చెందిన జాటోతు రాజు సరాఫరా చేస్తుండగా పట్టుకున్నామన్నారు. అతడిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు తెలిపారు. రాజుపై కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలకు భరోసా

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలు, రైతులకు భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 99 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.80 కోట్లు తీసుకువచ్చానని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల, అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టకంటి రామిరెడ్డి, ఘనపురపు అంజయ్య, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్లు వెన్నం లక్ష్మారెడ్డి, సూర్నపు సోమయ్య, బి.అజయ్ సారథిరెడ్డి, ఆర్ఐలు కృష్ణప్రసాద్, బషీర్, జూనియర్ అసిస్టెంట్ కవిత, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు పోతురాజు రాజు, శ్రీను, వెంకన్న, హరిసింగ్, జగన్, నాగలక్ష్మిశ్రీను పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు: అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ శ్వేత అధ్యక్షతన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల మారుమూల ప్రాంతాల అభివృద్ధితోపాటు బస్సులు నడవని గ్రామాలకు బస్సులు నడిపించే ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజాసంక్షేమ పథకాలతో సీఎం అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరస్వామి, ఎంపీఓ చంద్రశేఖర్, నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

కేసముద్రం: మండల కేంద్రానికి చెందిన మిత్తింటి రమేష్, తాళ్లపూసపల్లికి చెందిన ఉడుగుల ఉప్పలయ్య, జనగాం రామాచారి అనే ఇద్దరు వ్యక్తులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించి, 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. కార్యక్రమంలో అంబటి మహేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, సతీష్, సమ్మయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రకృతిని పూజించే పండుగ 'దాటోడి'

మహబూబాబాద్ రూరల్: ప్రకృతిని పూజించే పండుగ సీత్లా (దాటోడి) అని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, డాక్టర్ ఉమా దంపతులు అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన మండలంలోని సోమ్లాతండాలో మంగళవారం సీత్లా పండుగ వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మంగ్యానాయక్, దళ్ సింగ్ నాయక్, రాంచందర్, బాలాజీ, సుజాతఅమర్ సింగ్ పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

అందరి సహకారంతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: అందరి సహకారంతోనే అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మున్సిపల్ సర్వసభ్య సమావేశం స్థానిక ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో జరుగుతున్న పనులు అంచనా వ్యయం రాబడి విషయాలు సమగ్రంగా తెలియజేయడం లేదని ఆరోపించారు. ప్రస్తుత వర్షాకాలంలో వీధులలో నీరు నిలిచిఉండడం, సైడు కాలువలు శుభ్రం చేయకపోవడం పట్ల గ్రామంలో తీవ్ర ఒత్తిడి వస్తుందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కమిషనర్ శ్రద్ధ చూపాలన్నారు. స్థానిక సెయింట్ అగస్టీయస్ పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుగులోతు సింధూరరవికుమార్, వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, తహసీల్దార్ సైదులు, కమిషనర్ వెంకటస్వామి, కౌన్సిలర్లు ఎడెల్లి పరశురాములు, బయ్య బిక్షం, మక్సూద్, పానుగోతు సుజాతవెంకన్న, శ్రీను, కిషన్, హతీరాం తదితరులు పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

ఎమ్మెల్యేకు వినతిపత్రం

మండల కేంద్రంలో గర్ల్స్ కాలేజీ హాస్టల్ మానుకోటకు తరలించారని మరిపెడకు రప్పించాలని యూఎస్‌ఎఫ్ఐ విద్యార్థులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.800 కోట్లు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను వెంటనే విడుదల చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్ఐ నాయకులు తరుణ్‌సందీప్, ప్రణయ్, వెంకన్న, సంధ్య, స్వరూప, స్వాతి, దీక్షిత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు

మరిపెడ రూరల్: అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎల్లంపేట అంగన్‌వాడీ-3లో సూపర్ వైజర్ శ్రీలత ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయకుమారి, సీఏలు రజిత, గీత, ఆశ జ్యోతి, కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు. మండలంలోని వీరారం అంగన్‌వాడీ1, 2 కేంద్రాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంట కవిత, ఏర్పుల శ్రీవాణి, ఆయమ్మ నాగలక్ష్మి పాల్గొన్నారు.

డోర్నకల్: స్థానిక సుభాష్‌వీధిలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు గోర్పి, వాణి, నిర్మల పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: ఎల్లంపేటలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కేసముద్రం: రెండున్నర సంవత్సరాలు దాటిన పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా అన్నారు. మంగళవారం మండలంలోని భుక్యారాంతండా జీపీ శివారు కాలనీతండాలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట అనే కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సలీమా, ఎఎన్‌ఎం యాకమ్మ ల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

మరిపెడ: పెరిగిన ధరలకు అనుగుణంగా వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో కూలీలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాటికొండ అనంతచారి, మస్తాన్ కూలీలు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అటెండర్ రామచంద్రు పక్షవాతంతో బాధపడుతున్నాడు. మంగళవారం డీఈఓ రమచంద్రు ఇంటికి వెళ్లి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. డీఈఓ రూ.6వేలు, సూపరింటెండెంట్ ఫణి రూ.10వేల ఆర్థికసాయం చేశారు.

సీసీ ఫ్లోరింగ్ నిర్మించాలి

కురవి: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీసీతో ఫ్లోరింగ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గంధసిరి జ్యోతిబసు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణ పూర్తిగా బురదమయంగా మారిందని తెలిపారు. కార్యక్రమంలో వీరేందర్, శరత్, కార్తీక్, వినయ్, ప్రవీణ్, రవీందర్, అనిల్ పాల్గొన్నారు.

రైతులకు డ్రమ్ సీడర్ల పంపిణీ



డ్రమ్ సీడర్లు పంపిణీ చేస్తున్న ఆర్.ఉమారెడ్డి

మహబూబాబాద్ రూరల్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని మహబూబాబాద్ మండలంలో గల మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు డ్రమ్ సీడర్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా వరంగల్ ఆర్ఏఆర్ఎస్ సహ సంచాలకులు ఆర్.ఉమారెడ్డి మాట్లాడుతూ.. వరిలో నేరుగా విత్తే పద్ధతిలో ఉపయోగించే పరికరమైన డ్రం సీడర్ ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్సీ ఉపప్రణాళిక 2022-23 ద్వారా 50 మంది రైతులకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి, శాస్త్రవేత్తలు కిషోర్ కుమార్, రాంబాబు, క్రాంతికుమార్, రైతులు పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

కొత్తగూడ: యువత ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కష్టపడాలని గూడూరు సీఐ బాబూరావు సూచించారు. మంగళవారం మండలంలోని కర్నెగండి, దొరవారివేంపల్లి గ్రామాల్లోని యువకులు, గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసులు అంటే కేవలం శాంతి భద్రతలకే అన్నట్లు చూడవద్దని గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. యువత గంజాయి, గుట్కాలు, మాదకద్రవ్యాలకు బానిసలు కావద్దని సూచించారు. వాటి పరిష్కారం కోసం అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తామన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బాబూరావు

అనంతరం యువకులకు క్రీడా కిట్లను అందజేశారు. ఆయన వెంట ఎస్సైలు దిలీప్, రవికుమార్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై సునంద

మహబూబాబాద్ అర్బన్: యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని షీటీం ఎస్సై సునంద అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మంగళవారం గంజాయి, మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు తెలిస్తే కళాశాల యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. షీటీం వాట్సాప్ నంబర్స్ 871265 6935,79011 42009, టోల్ ఫ్రీ 112, 181 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.మధు, అధ్యాపక బృందం, షీటీం ఏఎస్సై ఆనందం, సిబ్బంది అరుణ, రమేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత



స్నేహనగర్ కాలనీలో మొక్క నాటుతున్న కౌన్సిలర్, తదితరులు

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, వనమహోత్స కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చిట్యాల జనార్దన్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులోని స్నేహనగర్ కాలనీలో మంగళవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కల పంపిణీతోపాటు మొక్కలు నాటారు. అనంతరం కాలనీ వాసులు కౌన్సిలర్ చిట్యాల జనార్దన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు రాజేశ్వర్‌రావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విక్రమ్, కరుణాకర్, మల్లారెడ్డి, ఉల్లయ్య, డీఎస్‌రెడ్డి, రవీంద్రానాయక్, మురళీ పాల్గొన్నారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మహబూబాబాద్ అర్బన్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్ర రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఎన్ఎస్ఎస్ మంగళవారం వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మమత, అధికారులు వెంకటేశ్వర్లు, రామా రత్నమాల, అధ్యాపకులు బొంద్యాలు, రాజేందర్, సుజిత్ రెడ్డి, రామ్ రెడ్డి, నరహరి, హతీరామ్, కాసిం పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు తోడ్పాటు అందిస్తాం..



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న జయశ్రీ

పెద్దవంగర: మహిళా సంఘాలకు ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని ఏపీడీ జయశ్రీ అన్నారు. మండల కేంద్రంలో నాబార్డ్ సహకారంతో లక్ష్యం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా మిల్లెట్స్ ఆహార ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని మంగళవారం డీపీఎంలు నళినినారాయణ, చంద్రశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలను అందిస్తామన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణాచారి, సీసీలు జీ సుధాకర్, పద్మ, సుజాత, సుధాకర్, మార్కెటింగ్ అధికారి ఝాన్సీ పాల్గొన్నారు.

ప్రాణం తీసిన గుంత

● మరొకరికి తీవ్రగాయాలు
● ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఘటన

మరిపెడ: పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా నిండుప్రాణం బలైంది. అనారోగ్యంగా ఉందని ఆస్పత్రికి వెళ్లి వస్తూ.. ప్రమాదానికి గురై ప్రాణాలే కోల్పోయిన విషాదకర ఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఈఘటనకు సంబంధించి, వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని వీరారం గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాస్ (45), కుమారుడు తాళ్ల రాకేశ్‌తో కలిసి మంగళవారం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై ఖమ్మం పట్టణంలోని ఓ ఆస్పత్రికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈక్రమంలో మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని మధుర వైన్స్ షాపు ఎదుట రోడ్డుపై ఉన్న గుంతలో ద్విచక్రవాహనం ఇరుక్కుంది. దీంతో శ్రీనివాస్ వాహనంపై నుంచి ఎగిరి రోడ్డుపై పడడంతో తలకు, చాతికి బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుకాల కూర్చున్న రాకేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి.



శ్రీనివాస్ మృతదేహం

సంక్షిప్త సమాచారం

ఇళ్లకు పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు ఇంటి పట్టాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన భూపోరాట కేసులో భాగంగా సీపీఐ నాయకులు మంగళవారం కోర్టుకు హాజరై అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో రేషపల్లి నవీన్, పోచారం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



గూడూరు: వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ వోర రాంబాబు అన్నారు. మండలంలోని మధనాపురంలో మంగళవారం తీగలవేణి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షానుబేగం, రమేష్, వెంకటేశ్వర్లు, లిల్లీ, పుష్ప, రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నర్సింహులపేట: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని డిమాండ్ చేస్తు మంగళవారం ముదిరాజ్ మహసభ జిల్లా అధ్యక్షుడు చిల్లా సహదేవ్ అధ్వర్యంలో పలు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రంను డీటీ సంజీవకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మంద వెంకన్న, సుంకరి ఉప్పలయ్య, శ్రీనువాస్, రామూర్తి, కృష్ణ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కేసముద్రం: తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారి ఓ గీతకార్మికుడు కిందపడి గాయాలపాలైన సంఘటన ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేముల యాదగిరి అనే గీతకార్మికుడు ఎప్పటిలాగే ఉదయం తాటిచెట్టు ఎక్కుతుండగా కాలుజారడంతో కిందపడ్డాడు. దీంతో అతడి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. దీంతో అతడిని 108లో మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

హర్షణీయం

నెహ్రూసెంటర్: కల్లుగీత కార్మికులకు వృత్తిలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కవచాలు అందించడం హర్షణీయమని గోపా జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లకొండ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజయవంతం చేయాలి

డోర్నకల్: రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన అమలు చేస్తుండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయని సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శి బి. అజయసారథి అన్నారు. డోర్నకల్‌లో మగళవారం నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న కురవిలో జరిగే సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి, నెల్లూరి నాగేశ్వర్‌రావు, తురక రమేష్, ప్రభేష్, జెన్ను స్వామి, రాంజి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

మరిపెడ రూరల్: మండలంలోని ఉల్లెపల్లి గ్రామానికి చెందిన నవిలే రేణుక ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు బొడ్డు వెంకన్న ఆధ్వర్యంలో రూ.5,500 ఆర్థికసాయం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చల్లమల్ల మహేష్‌రెడ్డి, బంటు కర్ణాకర్, ఉప్పలయ్య, వీరభద్రం, లింగయ్య పాల్గొన్నారు.

పీరీల సందడి

డోర్నకల్: మొహర్రం పండుగను పురస్కరించుకుని మంగళవారం ఊరూరా పీరీలు సందడి చేశాయి. కన్నెగుండ్ల, వెన్నారం, తొడేళ్లగూడెం, ముల్కలపల్లి, డోర్నకల్ గ్రామాల్లో పీరీలను వీధుల్లో ఊరేగించారు.

నివాళి

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్ యజమాని గొంగళ్ల వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందగా అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య మంగళవారం సంతాపం తెలిపారు. వెంకటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శంతన్ రామరాజు, పిట్టల రామ్మూర్తి, శేఖర్, జగ్గయ్య పాల్గొన్నారు.


చర్య తీసుకోవాలి

కురవి: సీరోలు మండల కేంద్రంలో దివ్యాంగుడితోపాటు మరొక వ్యక్తిపై దాడి చేసిన నిందితులపై చర్య తీసుకోవాలని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు తగరం నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం సీరోలు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దాడి విషయమై ఎస్పీని కలసి విన్నవించామన్నారు. కార్యక్రమంలో సహదేవ్, కమలాకర్, లింగన్న, నరేష్, మహేష్, శ్రీకాంత్, సంపత్, రాజు, బాధితులు సైదులు, రాజేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దంతాలపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనటంతో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలైనా సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి మండలంలోని తూర్పుతండాకు చెందిన గుగులోత్ నరేందర్ మండలకేంద్రం నుంచి ఇంటికి వస్తున్న క్రమంలో కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన పుల్లగూరి ఉమేష్ మండలకేంద్రానికి వెళ్తున్నాడు. ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఉమేష్ కాలు విరిగింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తొర్రూరులో ఓ ఆస్పత్రికి తరలించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



డోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లో ఉనుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అకస్మాత్తుగా నిలిచిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరిపొట్టును తరలిస్తున్న ట్రాక్టర్ ఇంజన్ నుంచి అకస్మాత్తుగా ట్రక్కు వేరు కావడంతో గాంధీ సెంటర్ మలుపు వద్ద ట్రాక్టర్ నిలిచింది. సుమారు గంటపాటు రాకపోకలకు అంతరాయం కలిగింది.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



గార్ల: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గార్లలో ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈధర్నాను ఉద్దేశించి పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగరాజు మాట్లాడారు. ఆరు సంవత్సరాలుగా విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రవీందర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి మహేష్‌కుమార్, నరేష్, వినయ్, దివ్య, ఉషారాణి, ప్రవళిక, భానుశ్రీ, రజిత, తదితరులు పాల్గొన్నారు.